తిరుమల తిరుపతి దేవస్థానములు

# బాల సప్తగిరి

సచిత్రమాసపత్రిక

ఆగష్టు 2020 వెల రూ.5/-

సప్తగిరి అనుబంధం

శ్రీ వామన జయంతి

29-08-2020





బ్రహ్మోత్సవాలలో అన్నమయ్య వేషధారి





బ్రహ్మోత్సవాలలో బాలికలచే నాట్యవిన్యాసం

తిరుమల తిరుపతి దేవస్థానములు



# బాలసప్తగిరి

'సప్తగిరి' అనుబంధం

సంపుటి: 01 | ఆగష్టు 2020 | సంచిక: 06

## విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| హిందూదేవుళ్లు | **బాలకృష్ణుని లీలలు**<br>- శ్రీ ఆర్.కోదండపాణి | 04 |
| పన్నిద్దరాళ్వార్లు | **శ్రీకులశేఖర ఆళ్వార్**<br>- విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు | 06 |
| కన్నడహరిదాసవరేణ్యులు | **భక్త కనకదాసు**<br>- ఆచార్య శివపురం మురళీధరరావు | 08 |
| చిత్రకథ | **కుమారధారాతీర్థం**<br>కథ : శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు: కె.తులసీప్రసాద్ | 10 |
| బాలనీతి | **అపకారికి ఉపకారం**<br>- డా॥ ఎ. సచ్చిదానందమూర్తి | 14 |
| విశిష్టబాలిక | | 16 |
| క్విజ్ | నిర్వహణ: డా॥ అల్లాడి సంధ్య | 17 |
| చిత్రలేఖనం | | 18 |


ముఖచిత్రం : వామనుడు


వెనుక చిత్రం : బాలకృష్ణుడు

హిందూ దేవుళ్లు

# బాలకృష్ణుని లీలలు

- శ్రీ ఆర్. కోదండపాణి


దేవకీవసుదేవుల అష్టమగర్భంలో శ్రీమహావిష్ణువు శ్రీకృష్ణుడిగా అవతరించాడు. చెరసాలలో జన్మించిన చిన్నికృష్ణుడు గోకులంలో యశోదా నందుల దగ్గర వారి పుత్రుడుగా పెరిగాడు. చిన్నికృష్ణుడుగా ఉన్నప్పుడే అనేక లీలలు అద్భుతాలు చేశాడు. అందులో బాలకృష్ణునికి విషపు పాలిచ్చి చంపడానికి వచ్చిన పూతన సంహారం పేర్కొనదగింది. అట్లే, కృష్ణుడు పడుకొని ఉంటే బండిరూపంలో దొర్లుతూ వచ్చి చంప బడ్డ శకటాసురుడు, బాలకృష్ణుని బరువుకు తట్టుకోలేక ముక్కలుముక్కలు అయిన తృణావర్తుడు.



బాలకృష్ణుని అల్లర్లపై గోకులంలో గోపికలు యశోదకు ఫిర్యాదు చేశారు. ఎట్లంటే– 'ఇంట్లో మీగడ–పాలు తిని, త్రాగి కుండలు పగలకొడు తున్నాడు. ఈ అల్లరికి అదుపు ఆజ్ఞ లేదా? ఉట్టి మీద కుండలు అందకపోతే పగలకొడుతున్నాడు. ఇక ఈ వ్రేపల్లెలో ఉండలేమని' తమ బాధలని చెప్పారు గోపల్లెవాసులు. అంతా విన్న యశోద 'చిన్ని కృష్ణునిపై నిందలు వేస్తున్నారని' గోపి కలపై కోప్పడింది. ఇవన్నీ చూస్తూ వింటున్నాడు జగన్నాటక సూత్రధారి చిన్నికృష్ణుడు.



ఒకరోజు బలరాముడు, గోపాలబాలురు గబగబా పరిగెత్తుకొని యశోదవద్దకు వచ్చి "అమ్మా కృష్ణుడు మన్నుతిన్నాడు. మేము కళ్ళార చూశాం." అన్నారు. యశోద పరిగెత్తుకొచ్చి



బాలకృష్ణుణ్ణి 'ఏరా! ఎందుకు మన్నుతిన్నావు? నా మాట వినవా ఏమిటి?' అని గట్టిగా అడిగింది. తల్లి కోపాన్ని చూసి "అమ్మా! నేనేం చిన్న పిల్లవాడినా మట్టి తినడానికి? నేనేమి వెఱ్ఱివాడినా? వీళ్ళ మాటలు అసలు నమ్మవద్దు! ఎట్లైనా నీతో నన్ను కొట్టించాలని ఇలాచేశా రమ్మా! అంతగా నాపై నమ్మకం లేకపోతే నా నోరు వాసన చూడమ్మా" అన్నాడు. యశోద 'ఏది నోరు తెరువు' అంది, బాలకృష్ణుడు నోరు తెరిచాడు అంతే!! అ నోటిలో సముద్రాలు, పర్వతాలు, సూర్యుడు, చంద్రుడు, అగ్ని ఇలా కొన్నేమిటి? విశ్వమంతా కనిపించింది. యశోద ఆశ్చర్యంతో ఉలిక్కిపడింది- ఇది కలనా? వైష్ణవ మాయనా? నేను యశోదను కానా? ఈ చిన్నిబాలుని నోటిలో విశ్వమంతా కనిపిస్తుందేమిటి? అని ఆశ్చర్యపడింది. అంతే బాలకృష్ణుడు యశోదపై మాయ కప్పాడు. వెంటనే యశోద మామూలు తల్లయింది. బిడ్డను దగ్గరికి తీసుకుంది. జరిగిందీ, చూచిందీ అంత మర్చిపోయింది. మరొకసారి మితిమీరిన కృష్ణుని అల్లరికి యశోదమ్మ త్రాళ్ళతో రోకలికి కట్టివేసింది. కృష్ణుడు కాసేపు అలాగే ఆడుకుంటూ త్రాడును లాగడం మొదలుపెట్టాడు రోలు అడ్డంగా తిరగబడి, రెండుమద్దిచెట్ల మధ్య ఇరుక్కొనగా, చిన్నికృష్ణుడు రోలును లాగాడు. అంతే! చెట్లు రెండూ ఊడి పడ్డాయి. అందుండి అశ్వనీదేవతలు శాప విముక్తిని పొందారు. ఇటువంటి బాల కృష్ణుని చేష్టలు అనేకానేకం. అటువంటి శ్రీకృష్ణుని అందరూ పూజించి, వారి కరుణాకటాక్షాలను పొందాలి.



ఓం కృష్ణాయనమః

పన్నిద్దరాళ్వార్లు

# శ్రీకులశేఖర ఆళ్వార్

- విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

కేరళలో 'కోళి' అనే పట్టణం ఉంది. ఆ రాజ్యానికి రాజు దృఢ వ్రతుడు. వారి పుత్రుడే కులశేఖరుడు. వీరు శ్రీమహావిష్ణువు యొక్క కౌస్తుభ రత్నాంశమున జన్మించారు. వీరు తమ జీవిత సర్వస్వాన్ని శ్రీహరి సేవకు అంకితం చేసారు. వారు శ్రీవేంకటేశ్వరస్వామిపై గల భక్తికి చిహ్నముగా 'తాను వేంకటాద్రియందు ఒక సోపానము అయితే ఆ స్వామివారిని నిత్యం కొలవవచ్చునని' అనుకొనేవారు.

శ్రీకులశేఖరులు రామాయణ గ్రంథాన్ని పారాయణం చేసే టప్పుడు అందులోని సంఘటనలకు కదలిపోయి తాదాత్మ్యం చెందే వారు. శ్రీరాముడు 14వేల రాక్షసులతో యుద్ధం చేస్తున్నాడని విని, సీతా పహరణం ఘట్టం విని, సముద్రాన్ని దాటవలసి ఉంటుందని, రావణాసు రునితో యుద్ధం చేయడానికి తన సైన్యంతో బయలుదేరాడు. సముద్రం లోనికి వస్తున్న కులశేఖరుల భక్తిని చూచి, శ్రీసీతారామలక్ష్మణులు ప్రత్యక్ష మయ్యారు. శ్రీకులశేఖరుడు శ్రీరాముణ్ణి స్తుతించి సముద్రమున దిగుట మాని, వెన్నక్కి తిరిగి చూడగా శ్రీరాముడు అదృశ్యమయ్యెను. అప్పుడు శ్రీకులశేఖరులు తాను ఎంత పాపాత్ము డని దుఃఖించారు. ఇటువంటి రామా యణసంఘటనలు వినేటప్పుడు కుల శేఖరుల పరిస్థితి చూసి అక్కడి మంత్రులు శ్రీరాముడు యుద్ధంలో గెలిచాడనే వార్తలను అందిస్తుండేవారు.



కులశేఖర చక్రవర్తి చేసే భాగవత కైంకర్యం ఆతిథ్యం అద్భుతం, అపూర్వం. వైష్ణవులైన వారెందరో వారి ఆతిథ్యాన్ని పొందారు. వారు ఎప్పుడూ తన

రాజ్యమున భగవద్గుణానుభవము కథనము చేసే భాగవతకైంక ర్యములందే కాలక్షేపం చేసేవారు.



వీరి ప్రవర్తన నచ్చక, మంత్రులు ఉపాయంతో స్వామివారి ఆభరణాన్ని దొంగిలించి, దానిని శ్రీవైష్ణవుల మీద నెట్టివేశారు. శ్రీవైష్ణవులే ధనాశతో ఈ పని చేసి ఉంటారని కులశేఖరులకు తెలిపారు.

ఇది విని కులశేఖరులు ఆగ్రహించి, “భాగవతులు పరమపవిత్రులు, వారు చౌర్యానికి పాటుపడరు. దానికి ఇదే సాక్ష్యం” అంటూ బుస కొడుతున్న నల్లత్రాచును తెప్పించి చేత పట్టుకున్నారు. ఆ దృశ్యాన్ని చూసి మంత్రుల పై ప్రాణాలు పైనే పోయినవి. అప్పుడు మంత్రులు కులశేఖరులు రాజ్యం మీద విరక్తి పొందడం వల్ల, తాము ఈ పని చేశామని క్షమించమని వేడుకుంటారు.



అటుతర్వాత, కులశేఖరులు పుత్రునికి రాజ్యాభిషేకం చేసి శ్రీరంగానికి ప్రయాణమయ్యారు. వారు శ్రీరంగనాథుడు, శ్రీవేంకటేశ్వరుడు మొదలగు విష్ణుదేవులను గురించి, ‘పెరుమాళ్ తిరుమొళి’ అనే నూరు పాశురాలుగల ద్రావిడ ప్రబంధం రచించి, పాడి ప్రసిద్ధి చెందారు. సంస్కృతంలో ‘ముకుందమాల’ రచించారు. వీరు ఆళ్వారులలో ప్రసిద్ధి పొంది, శ్రీరామచంద్రుని వలె రాజ్యాన్ని పరిపాలించారు.

వీరు పన్నెండుమంది ఆళ్వార్లలో **‘కులశేఖరాళ్వారు’**గా ప్రసిద్ధి చెందారు.

కన్నడ హరిదాస వరేణ్యులు

# భక్త కనకదాసు

- ఆచార్య శివపురం మురళీధరరావు

ఆలయానికి వెళ్తే భగవంతుడు ఎటువైపు ఉంటే భగవంతుని అటువైపు వెళ్లి దర్శించుకుంటాము. భగవంతుడే భక్తుడున్నచోటికి తిరిగితే! ఆ భక్తుడు ఎంత పుణ్యవంతుడో కదా! **'భక్త కనకదాసు'** విషయంలో ఇదే జరిగింది. ఉడుపి శ్రీకృష్ణుని కరుణాకటాక్షాలను పొందాడు కనకదాసు. కనకదాసు ఉన్న వైపు ముఖాన్ని త్రిప్పి ఉడుపి శ్రీకృష్ణుడు తన దివ్యదర్శనాన్ని ఇచ్చాడు. భగవంతునిపై ఉన్న అచంచల విశ్వాసమే అతణ్ణి మహా భక్తునిగా చేసింది. వీరి తల్లిదండ్రులు బుచ్చమ్మ, వీరప్ప. వీరు శ్రీవేంకటేశ్వరుని భక్తులు. వారికి ఎంత భక్తి ఉందో, అంతే భక్తి కనకదాసుకు ఉంది.



మహాభక్తుడైన కనకదాసు తీర్థయాత్రలు చేస్తూ, తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శించుకోవడానికి వెళ్లాడు. కనకదాసు రాకను వేంకటేశ్వరుడు గుర్తించాడు. కనకదాసుకు ప్రత్యేక దర్శనం చేయించమని మహంతులను ఆదేశించాడు. కాని మహంతు అతి సామాన్యముగా ఉన్న కనకదాసుని గుర్తించలేక పోయాడు. కనకదాసేమో దర్శనం దొరకక ముఖద్వారం వద్ద తారాట్లడసాగాడు. అప్పుడే భగవంతునికి సంబంధించిన కొన్ని నగలు మాయమైనట్లు అధికారులు గుర్తించారు. ఆలయం ఎదుట తిరుగుతున్న కనకదాసుపై దొంగతనాన్ని పెట్టి, బంధించి, కొరడాదెబ్బలతో హింసించారు. కనకదాసు స్పృహ తప్పి పడిపోయాడు. అప్పుడు ఆర్తత్రాణపరాయణుడైన శ్రీనివాసుడు మహంతు కలలో కనిపించి,



కోపం ప్రదర్శించాడు. 'గౌరవంగా దర్శనం చేయించమని నేను ఆదేశిస్తే, నీవు కొరడా దెబ్బలు తినేట్టు చేస్తావా' అని కన్నెర్ర చేశాడు. మహంతు హడలిపోయి కనకదాసును విడిపించి, ఆయనకు ప్రత్యేక దర్శనం చేయించాడు. కనకదాసుకు స్వామి దర్శనం కాగానే, పోయిన నగలు దొరికినట్లుగా మహంతుకు వర్తమానం అందింది. అప్పుడు ఇద్దరికి స్వామిలీల అర్థమైంది.

అన్ని పుణ్యక్షేత్రాలు తిరుగుతూ కనకదాసు శ్రీకృష్ణుని దర్శనానికై ఉడుపి క్షేత్రానికి చేరుకున్నాడు. స్వామి దర్శనం కాలేదు. స్వామి దర్శనానికి అనుమతించమని అక్కడి నిర్వాహకులను ఎంతో ప్రాధేయపడ్డాడు.



ఇక మానవులకు కరుణ లేదని తెలిసికొని ఆ దేవదేవుని ప్రార్థించాడు. స్వామి దర్శనం కోరుతూ కిటికీకి ఒక ప్రక్కగా నిలబడి వెక్కి వెక్కి ఏడ్చాడు. అప్పుడే ఉడుపిలో ఒక పరమాద్భుతం జరిగింది. స్వామి వారు తన దిశను మార్చుకుని కనకదాసు విలపిస్తున్న కిటికీ వైపునవు తిరిగి తన భక్తుడైన కనకదాసుకు దర్శనభాగ్యం కలిగించాడు. అప్పటినుండి భక్తులు శ్రీకృష్ణుని కిటికీ వైపునుండే దర్శనం చేసుకోవడం ఆనవాయితీ అయింది. అదే **"కనకనకిండి"**(కనకదాసకిటికి)గా పిలువబడుతోంది.


''కాగినెలె యాదికేశవ" అంకితగా కన్నడంలో అనేక కీర్తనలను, 'మోహన తరంగిణి', 'నళచరిత్ర', 'హరిభక్తిసార' అను గ్రంథాలను రచించిన కనకదాసు హరిదాస శ్రేష్ఠులైనారు. వీరు 'తిరుపతి యవాస శ్రీవేంకటేశను నీను స్మరిసి' అంటే శ్రీవేంకటేశుడవు నీవు, నిన్ను స్మరించేవాడను నేను అని, 'ముట్టబేడ' అను కీర్తనలో 'సిరి రామ మంత్ర సదా జపి' రామమంత్ర జపం, తిరుపతి యాత్రను చేసేవారిని ముట్టకండని యముడాజ్ఞాపించాడని అంటాడు. వీరి కీర్తనలు హరిదాస వాఙ్మయంలో ప్రసిద్ధి చెందాయి.

చిత్ర కథ


# కుమారధారాతీర్థం

కథ - డి. శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు - కె. తులసీప్రసాద్


శ్రీవేంకటాచలం మీద ఆశ్రమాన్ని నిర్మించుకుని అందులో వృద్ధుడు, అంధుడైన ఒక బ్రాహ్మణుడు నివసిస్తున్నాడు. ఒకరోజు అతను తన కుమారుడైన కౌండిన్యునితో కలిసి తిరుగుతూ ఆశ్రమం నుంచి చాలాదూరం వచ్చాడు.






కాసేపు, నిరీక్షించిన తర్వాత ఆ వృద్ధబ్రాహ్మడు బిగ్గరగా అరవసాగాడు





ఆ వృద్ధుని అరుపులు విని అతని దగ్గరికి వచ్చాడు స్వామి




ఎవరూ లేరా? అయ్యా! తమరు ఎవరు?
తాతా! నువ్వూ నేనూ తప్ప ఇంకెవరూ లేరు!
4
నా కొడుకు కోసం వెదుకుతున్నాను. నాకిప్పుడు దిక్కెవరు?
దిక్కులేని వాళ్లకి దేముడే దిక్కు
5
తాతా! కాటికి కాళ్ళు జాపుకున్న నీకు ఇంత పుత్రవ్యామోహం తగదు. ముక్తి కోసం పరితపించటం మేలు!!
6
నాకు ముక్తి వద్దు కానీ, నా కోరిక తీరుస్తావా? నువ్వు స్వామివే అనుకుంటున్నాను.
7
తాతా! అందరూ ముక్తి కావాలని కోరుతుంటారు. కానీ, నువ్వేమో నాకు ముక్తి వద్దు అంటున్నావేంటీ?
8
నేను జీవితకాలంలో దేవపితృకార్యాల్ని చెయ్యలేదు. వాళ్ళ ఋణం తీర్చుకోవాలి. ఇప్పుడు నాకు ఆ అవకాశమివ్వు!
9


10
అయితే, నేను చెప్పినట్టు చెయ్యి తాతా!
అలాగే స్వామీ!
ఆ వృద్ధబ్రాహ్మణుని మెల్లగా నడిపించుకుంటూ ఒక జలధార దగ్గరికి తీసుకెళ్ళాడు స్వామి..
తాతా! ఈ జలధార క్రింద స్నానం చెయ్యి!
11
స్వామి చెయ్యి పట్టుకొని జలధార వైపు నడిచాడు ఆ వృద్ధబ్రాహ్మణుడు...
12
స్వామి ఆసరాతో... ఆ వృద్ధబ్రాహ్మణుడు జలధార క్రింద హాయిగా స్నానం చేశాడు
ఏంటీ అద్భుతం? ఇక్కడ స్నానం చెయ్యగానే నేను నవయువకుడిగా మారిపోయాను
13

అంతవరకూ ఆ వృద్ధుని వెంట ఉన్న ఆ యువకుడు నవమోహనాకారుడు.
శ్రీవేంకటేశ్వరునిగా మారిపోయాడు. అతనికి దివ్యదర్శనభాగ్యం లభించింది.




వచ్చే సంచికలో...
శ్రీవేంకటేశ్వరుని మరో దివ్యలీలా విలాసాన్ని దర్శించి.. తరిద్దాం!

స్వస్తి!




# అపకారికి ఉపకారం

- డా॥ ఎ. సచ్చిదానందమూర్తి


**ఉపకారికి నుపకారము**
**విపరీతము కాదు సేయ వివరింపంగా**
**అపకారికి నుపకారము**
**నెపమెన్నక సేయువాడు నేర్పరి సుమతీ॥**

పూర్వం అయోధ్యా నగరంలో ఒక వైష్ణవసాధువు నివసించేవాడు. ఒకనాడు ఆ సాధువు సరయూ నది దాటి మరో చోటుకు వెళ్లవలసి వచ్చింది. అది వానాకాలం. కాబట్టి సాధువు నదీ తీరం వైపు త్వరత్వరగా వెళ్లసాగాడు. ఆ నది ఒడ్డులో ఒక పడవ మాత్రమే ఉంది. అది బయలుదేరడానికి సిద్ధంగా ఉంది. అప్పటికే పడవ మనుషులతో నిండి ఉంది. అందులోని వారు సాధువుని చూసి, వారు సాధువుతో "పడవలో చోటే లేదు. నువ్వు తరువాతి పడవలో రా" అంటూ చెప్పారు. వారికి సాధువుతో కలిసి ప్రయాణం చేయడం ఏమాత్రం ఇష్టం లేదు. ఆ రాత్రి వేరొక పడవ లేకపోవడంతో, ఆ సాధువు ఆ పడవలోనే వెళ్లాలని నిశ్చయించుకున్నాడు. ఎందుకంటే గాలి, ప్రవాహమూ ఉద్ధృతంగా ఉంది. పడవ వానిని కోరగా, అతడు సాధువును "మీరు పడవలో ఎక్కండి" అని అన్నాడు.

పడవలోని ప్రయాణికులు సన్న్యాసి పడవలో ఎక్కాడన్న కోపంతో, అతణ్ణి నిందించసాగారు. కానీ సాధువు భగవన్నామస్మరణలో మునిగి పోయి, వారి మాటలను పట్టించుకోలేదు. అప్పుడు పడవ సరిగ్గా నది మధ్యలో ఉంది. ఇంతలో గాలి విపరీతంగా వీచసాగింది. సాధువు కళ్లు తెరవలేదు. ఇంతలో ఒకడు సాధువు మెడపై కొట్టాడు. సాధువు నిశ్చలంగా ఉన్నాడు. సాధువులకు సహనమెక్కువ కదా! ఇక లాభం

లేదనుకున్న ప్రయాణికులు సన్యాసిని నదిలో తోసివేయడానికి సిద్ధమయ్యారు. కాని, భక్తుని కష్టాలు చూసి భగవంతుడు ఉపేక్షించ లేదు కదా! ఆ సమయంలో ఆకాశంలో అశరీరవాణి ఇలా పలికింది. "ఓ సాధుశ్రేష్ఠా! మీరు అనుమతిస్తే మిమ్మల్ని బాధిస్తున్న వీరందరినీ క్షణంలో నదిలో ముంచివేస్తాను" అని.

పడవలోని వారు అశరీరవాణి మాట విని, వణికిపోయి, భయపడ్డారు. సరిగ్గా అశరీరవాణి మాటలతో సాధువు బాహ్యంలోకి వచ్చాడు. అతనికి పడవలోని వారి స్థితి తెలిసిపోయింది. వెంటనే సాధువు



భగవంతుని స్మరిస్తూ, "ఓ దేవా! నాతో పడవలో ఉన్న వారందరూ నీ బిడ్డలే కదా! నీవే వీరిని మన్నించి, కాపాడాలని వేడుకుంటున్నాను" అని ప్రార్థించాడు. భగవంతుడు ఆ సాధువు ప్రార్థనను మన్నించి అందరినీ కాపాడాడు. సాధువు ప్రార్థన ఫలంగా ప్రాణాలు కాపాడబడిన ప్రయాణీకులు, సజ్జనులుగా పరివర్తన చెందారు. కాబట్టి **"అపకారికి కూడ ఉపకారము"** చెయ్యాలన్న నీతిని గ్రహించాలి మనమందరము.

# విశిష్టబాలిక



**పేరు** - ఎ.ఛార్మితసింహ

**తరగతి** - 6వ తరగతి

**పుట్టిన తేది** - 17-01-2010

**తల్లిపేరు** - శ్రీమతి ఎ.సీతాలక్ష్మి, సహాయకార్యనిర్వహణాధికారిణి, తి.తి.దే. తిరుపతి.

**తండ్రిపేరు** - శ్రీ ఎ.నరసింహబాబు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, ఎ.పి.ఎస్.పి.డి.సి.ఎల్., పుత్తూరు.

**పాఠశాల పేరు** - సిల్వర్ ఓక్స్ ది స్కూల్, భవానినగర్, తిరుపతి.

**సాధించిన ఘనత - 'బాలికా మేధావి' (భరతనాట్యం)**

01) 6వ తరగతిలో ఉంటూ శైక్షికపరంగా 'పాఠశాల ఫస్ట్'.

02) ప్రాథమిక తరగతులకు 'హెడ్‌గర్ల్'.

03) తన గురువైన కేశవి బాగేదల్లి (వాసవికళాకేంద్ర) దగ్గర 'భరతనాట్యం'లో మెళకువలు నేర్చుకొని, 'భరతనాట్యం'లో విశేషకౌశలప్రదర్శన.

04) తన 'భరతనాట్య' కౌశలంతో 'బాలికా మేధావి'గా రాణింపు.

05) ఇప్పటివరకు 'భరతనాట్యం'లో కార్యక్రమాలు చేసి మూడుసార్లు 'గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్సు'లో (2018, 2019 సంవత్సరాలలో హైదరాబాద్, చెన్నయ్, బెంగుళూరులలో నాట్యకార్యక్రమాలలో)పేరు నమోదైన చిన్నారి.

**అవార్డులు-**



2019- 'భారతీయ నాట్యకళాభినేత్రి'- శ్రీలలితకళానృత్య నికేతన్, రాజమహేంద్రవరం.

2019- 'నాట్యసంకల్ప అవార్డు', శ్రీగణపతి నృత్యోత్సవం, కాణిపాకం.

2019- 'డైనమిక్ టాలెంట్ అవార్డు', శిల్పారామం, తిరుపతి

2020- 'నాట్యశ్రీ' అవార్డు, శిఖరమ్ ఆర్ట్ థియేటర్స్, హైదరాబాద్.

# క్విజ్

**నిర్వహణ- డా॥ అల్లాడి సంధ్య**

**1) క్రిందివారిలో 'ఆదికవి'గా ప్రసిద్ధి చెందిన వారెవరు?**

అ) వేదవ్యాసుడు  ఆ) కాళిదాసు
ఇ) వాల్మీకి  ఈ) వశిష్ఠుడు

**2) శ్రీమద్రామాయణంలోని శ్లోకాల సంఖ్య ఎన్ని?**

అ) 24000  ఆ) 10000
ఇ) 100  ఈ) 100000

**3) రామాయణంలో మొత్తం ఎన్ని కాండలున్నాయి?**

అ) 4  ఆ) 12
ఇ) 7  ఈ) 10

**4) రామాయణ కాండలలో పెద్దకాండ ఏది?**

అ) కిష్కింధకాండ  ఆ) యుద్ధకాండ
ఇ) అయోధ్యకాండ  ఈ) బాలకాండ

**5) రామ - సుగ్రీవుల మైత్రి (స్నేహం) గురించి రామాయణంలో ఏ కాండలో ప్రస్తావించబడింది?**

అ) అయోధ్యకాండ  ఆ) యుద్ధకాండ
ఇ) కిష్కింధకాండ  ఈ) బాలకాండ

**6) రామాయణంలో లంకాదహనం గురించి చెప్పబడిన కాండ ఏది?**

అ) యుద్ధకాండ  ఆ) అయోధ్యకాండ
ఇ) కిష్కింధకాండ  ఈ) సుందరకాండ

**7) రామాయణకథ ఏ యుగంలో జరిగింది?**

అ) కృతయుగం  ఆ) త్రేతాయుగం
ఇ) సత్యయుగం  ఈ) ద్వాపరయుగం


---

**జవాబులు**

1) ఇ 2) అ 3) ఇ 4) ఇ 5) ఇ 6) ఈ 7) ఆ

# చిత్ర లేఖనం

**ఈ బొమ్మకు**
**రంగులు వేద్దామా...**



**పై బొమ్మను క్రింది గళ్ళలో గీయండి...**



బ్రహ్మోత్సవాలలో బాలలచే జానపదనృత్యం





బ్రహ్మోత్సవాలలో బాలికలచే కోలాటాలు

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams
printing on 30-08-2020. Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742,
Postal Regd.No.TRP/10 - 2018-2020
Licensed to post without prepayment No.PMGK/RNP/WPP-04/2018-2020

